“ఏమండీ, అమ్మాయి ఎలాఉంది? మీరు కలలుకనే మీ డ్రీమ్ డాటర్‌లా లేదూ? మన అబ్బాయికి పెర్ఫెక్ట్ జోడీ అవుతుంది గదండీ?” అంటూ పెళ్ళి చూపులు జరుగుతున్న ఆ హాలులో మెల్లిగా భర్తని కదిపింది శోభ.

“...ఊ!” ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు హరి. అమ్మాయి అప్సరసలా ఉంది. లేత బంగారు ఛాయ! కొంచెం సన్నగా, మరీ పొడుగూకాదు, పొట్టీకాదు. అందమైన పెద్దకళ్ళు, తెలివిని సూచించే పదునైన చక్కని ముక్కు... రాత్రి కురిసిన మంచు బిందువుల్ని రాల్చుకోడానికి ఉషోదయంవేళ వికసిస్తున్న గులాబీ మొగ్గలా ఉంది.

# జె.ఆర్.ఇందు



అచ్చం ఇలాగే ఉండే అపురూపమైన అందమైన పిల్లని ఎప్పుడో, ఎక్కడో చూసిన గుర్తు బుర్రలో ఎక్కడో తన్నుకుంటోంది. గుర్తుకు రావడం లేదు.

“ఏం చదివావమ్మా?” అమ్మాయి వివరాలన్నీ ముందే తెలిసినా, మాట్లాడించాలని శోభ తాపత్రయం.

“ఎమ్మే ఇంగ్లీషు లిటరేచర్.” కోకిల కంఠంలా ఉంది గొంతు.

“అమ్మాయి చక్కని పొయిట్రీ వ్రాస్తుందండి. అద్భుతంగా వీణ వాయిస్తుంది. మంచి ఆర్టిస్టు కూడా.” అమ్మాయి పినతల్లి కాబోలు చెపుతోంటే హరికి కడుపు నిండినట్టుగా ఉంది. అసలు పెళ్ళి చూపులకే రావని గొణిగిన సుపుత్రుడు కళ్ళార్పకుండా పిల్లవంకే చూస్తున్నాడు! తనకి నచ్చే విషయాలేవీ వాడికి నచ్చవు. తన టేస్టులన్నీ పాత చింతకాయ పచ్చడి అంటాడు.

“రండి. ఇల్లూ, వాకిలీ చూద్దురు గాని” అంటూ అందర్నీ లేవదీసి వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడానికి వీలు కల్పించారు.

వాళ్ళందరూ పెరట్లోకి వెళితే హరి ఒక్కడూ డాబా ఎక్కాడు. అటువంటి పిల్లని ఎక్కడ చూశాడో గుర్తుకొచ్చింది. కాలం పదహారేళ్ళు వెనక్కి తిరిగిరది. రాజమండ్రిలో మాస్టారుద్యోగం చేస్తూ, ఎమ్.ఇడి చేయడానికి తిరుపతి వెళుతున్నాడు. అప్పుడు తన వయసు ముప్పై నాలుగు. ఎనిమిదేళ్ళ కొడుకు నాలుగు చదువుతున్నాడు. వాడు తల్లి పొట్టచీల్చుకుని సిజేరియన్ ఆపరేషన్‌తో భూమ్మీదపడ్డాడు. జన్మ నివ్వడం ఎంతబాధాకరమైన అనుభవమో శోభ పడ్డబాధ చూసినతర్వాత, మళ్ళీ ఆ బాధకి ఆవిడని గురిచెయ్యడం అమానుషం అనిపించి, తనకింకా పిల్లలు కావాలనే కోరిక గాఢంగా ఉన్నాసరే ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. ఓ అమ్మాయికూడా ఉండాలని బలమైన కోరిక పీడించేది. లోకమంతా ఆడపిల్లలు వద్దుబాబోయ్ అనుకుంటూంటే... ఆడపిల్లలేని ఇల్లు ఇల్లే కాదు అనే తనని అంతా వింతగా చూసేవారు. తల్లిదండ్రుల్ని ఆడపిల్లలు అభిమానించినట్టు మొగపిల్లలు ఎప్పుడూ అభిమానించలేరని ఎందుకో తనకి అభిప్రాయం. ఉన్నావా, తిన్నావా అని ఆడపిల్ల అడిగినట్టు మొగపిల్లవాడు తల్లిదండ్రుల్ని అడగడు. అందుకు తన సుపుత్రుడే తార్కాణం. తను తాగిన కాఫీ కప్పు కూడా ఎక్కడిదక్కడే వదిలేస్తాడే గానీ, కడిగి కిచెన్‌లో పెడదామనుకోడు. వాడి గదైనా తుక్కుతో నింపడమేగానీ నీట్‌గా తుడుచుకుందామని తోచదు. చిన్నచిన్న చేతులతో చిన్నచిన్న పనులు చేస్తూ ఆడపిల్ల తల్లికి సాయం చేసినట్లు మొగపిల్లలెప్పుడూ ఇంటిపనిలో తల్లికి చేదోడుగా ఉండరు. చిన్నసిల్కు పరికిణీ, జాకెట్ వేసుకుని పొడవాటి పూలజడతో డాడీ అంటూ తన మెడ వాటేసుకునే ఆడపిల్ల లేదే అని తను బాధ పడటం తనకొలీగ్స్‌ని వింతపరిచేది. “నీకే మోయి, హాయిగా ఆడపిల్లల్లేరు. పిసినిగొట్టుగా బ్రతికి కట్నాలు కూడేసి పెళ్ళి చెయ్యాల్సిన ఖర్మ నీకు లేదు.” అనేవారు. తను వాళ్ళతో ఏకీభవించేవాడు కాదు.

మొగపిల్లవాడి తండ్రిగా జీవితంవేరు; ఆడపిల్ల తండ్రిగా జీవితానుభవం వేరు అని తనకి అనిపించేది. గ్రాండ్‌పేరంట్స్‌కి కూతురిపిల్లలు చేరువైనట్టుగా కొడుకులపిల్లలు చేరువవ్వక పోవడం

తను చాలా ఇళ్ళల్లో చూశాడు. ఆడపిల్ల తండ్రిగా జీవితంలో ఓ పరిపూర్ణత ఉంది. ఆడపిల్లలేని ఇంట్లో ఏదో వెలితి! ఆడపిల్లని "అమ్మా" అని పిలవడంలో ఉన్న ఆనందం, తృప్తి మొగపిల్లవాళ్ళని ఒరే అనిపిలవడంలో కన్పించేది కాదు. తను



స్కూల్లో కూడాఅంతే. ఆడపిల్లల క్లాసంటే తనకి ప్రాణం. మొగపిల్లలంత అల్లరి చెయ్యరు. వాళ్ళకి మల్లె తన్ను కోవడం, కంప్లెయింట్స్‌తో ప్రాణాలు తియ్యడం చెయ్యరు. మిగతా మేష్టర్లందరూ ఆడ పిల్లల్ని "ఒసే, ఏమే" అనిపిలిస్తే, తనొక్కడూ 'అమ్మా' అని పిలుస్తోంటే 'బయల్దేరాడు ప్రొఫె షినిస్టు లీడరు' అంటూ తనవెనక వాళ్ళు ఎకసెక్కాలాడటం తనకి తెలుసు.

పిల్లల్ని, ముఖ్యంగా ఆడపిల్లల్ని పెంచడంమీద తనకి కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. అవి మిగిలినవాళ్ళకి ఎంత సిల్లీగా కన్పించినా తనకో కూతురుంటే నిజంగానే అలాపెంచి ఉండేవాడు. ఆడపిల్లల్ని ఎటువంటి కట్టడీ లేకుండా, స్వేచ్ఛగా, మొగల్ రాజకుమార్తెల్లాగా పెంచాలని తనొకసారి స్టాఫ్‌రూంలో అంటే... ఫిమేల్ కొలీగ్స్‌సైతం విరగ బడి నవ్వి, తనని ఫాంటసీల్లో బ్రతికే కలల వ్యాపారివన్నారు. "నిజంగా నీకో ఆడపిల్లే ఉంటే, నువ్విచ్చే స్వేచ్ఛకి పెళ్ళికి ముందే నిన్ను తాతని చేసేది" అంటూ అపహాస్యం చెయ్యడం తనకెంతో

ఆడపిల్లని గుండెలమీద బండరాయిలా భావించే ఆ దంపతులు. ఆడపిల్ల కోసం తన తపన చూసి ఓసారి తన శ్రీమతి అంది... "పోని మరో కాన్పు చూద్దామా మీకోరిక తీర్చడానికి" అని. నిజానికి అప్పటికి ఇంకా పిల్లల్ని కనే వయసేమీ మీరిపోలేదు. తన వయసు ఫ్రెండ్స్ కొందరికి ఇంకా పెళ్ళేకాలేదు: ఇంటి బాధ్యతలవల్ల కొందరికీ, కట్నాల బేరాలు కుదరక కొందరికి. తనకోరిక కోసం, ఆడపిల్లకోసమైనా సరే శోభని మరోసారి ఆ ప్రసవపు బాధకి గురిచెయ్యలేదు. పోస్ట్ ఆపరేటివ్ ఎఫెక్ట్సుతో ఎంతబాధ అనుభవించిందో తనకి గుర్తే. ఏ అనాథ ఆడపిల్లనో తెచ్చి పెంచుకుందామంటే శోభ అంగీకరించలేదు. అప్పటినుండి కొడుక్కి త్వరగా పెళ్ళిచేసి చక్కని అమ్మాయిని కోడలుగా తెచ్చుకుని కూతురిలేని లోటు తీర్చుకోవాలని అనుకునేవాడు.

తన భావాలూ, తన జీవితం ప్రపంచానికి నవ్వులాట! ఫ్రెండ్స్‌కి తనో లాఫింగ్‌స్టాక్! ఎక్కడైనా చక్కటి అమ్మాయిని చూస్తే "ఈ అమ్మాయి చాలా బావుంది. మన

# డ్రీమ్ డాటర్

బాధను కల్గించింది. ఆడపిల్లలన్నా, ఆడవాళ్ళ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలన్నా వీళ్ళ కెందుకింత చిన్నచూపు అనిపించేది. స్త్రీకి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేకుండా, జీవిత భాగస్వామినిగా గౌరవించకుండా, గదుల్లో బంధించి శరీరపు వేడి దించుకోవడం ఓ శృంగారమా? ఆత్మని తాకని శృంగారం ఓ దాంపత్యమా? ఎక్కువ, తక్కువ భావనలతో, చీకటి మనస్సులతో వీళ్ళు అను భవించేది సెక్సా? కత్తిరించుకున్న మనస్సు లతో, కుదించుకుపోయిన ఆలోచనలతో, నూతిలో కప్పల్లా బ్రతికే వీళ్ళు పరిపూర్ణ శృంగా రానుభవపు పొలిమేరల్లోకి కూడా ఎప్పుడూ చేరుకోలేరేమో అనిపించేది. ఒకోసారి అందరి లాగా ఆలోచించడం, వాళ్ళలా బ్రతకలేకపోవడం తన లోప మేమో అనుకునేవాడు.

ఎప్పుడైనా ఏ ఫ్రెండ్ ఇంటికో వెళ్ళినప్పుడు, చక్కని వాళ్ళ ఆడపిల్లల్ని చూసి ముచ్చట పడితే "తీసుకెళ్ళి పెంచి కట్నమిచ్చి పెళ్ళి చెయ్యి నాయినా, మా బరువు దిగుతుంది" అనేవాళ్ళు..

వాడికి జోడీ అవుతుంది. కదూ?" అని శోభతో అంటే "ఇంకనేం, రావేకోడలు పిల్లా, మనింటికి పోదాం అనండి... హైహీల్సు తీస్తుంది" అనేది నవ్వుతూ.

ఆరోజు రాత్రి ఎమ్సెయిడి ట్రైనింగ్‌కోసం తను తిరుపతి వెళుతూంటే... రాత్రి విజయవాడ స్టేషన్ లో తన బెర్తుకి ఎదురుగా క్రింద బెర్తులోకి ఓ టీనేజ్ గర్ల్ వచ్చింది. ఓ పెద్ద సూట్‌కేసునీ, ఎయిర్‌లైన్స్ బాగ్‌నీ కష్టంమీద మోసుకొస్తూ, పద హారు లేక పదిహేడేళ్ళు ఉండొచ్చు. ఆయాసం వల్ల కాబోలు కొంచెం వగరుస్తోంది. నుదుటిమీద విరుచెమట బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. చక్కని కనుముక్కు తీరుతో గ్రీకు శిల్ప సుందరిలా ఉంది. ఖరీదైన పంజాబీ డ్రెస్‌లో, భుజాల దాకా కత్తిరించుకున్న నల్లని పట్టైన పంకీల జుట్టుతో, వంటినుండి వస్తున్న మంద్రమైన పరిమళంతో పెట్టె లోని అందరి దృష్టినీ ఒక్కసారి ఆకట్టు కుంది. తనవంక చూస్తున్న జనాల్ని ఓసారి చూసీ చూడ నట్టుగా చూసి జిప్‌బాగ్ తీసి దుప్పటి,

ఎయిర్ పిల్లోతో పక్క వేసుకుని పడుకుని ఇంగ్లీషు మేగజైను చేతిలోకి తీసుకుంది.

ఆ స్లీపింగ్ బ్యూటీ వంక చాలా జతల కళ్ళు... కొన్ని మాటిగానూ, మరికొన్ని వంకర చూపులతోనూ గుచ్చడం గమనించాడు. తన బెర్తుకెదురుగా ఉన్న కుర్రాడైతే చదువు తున్న డిటెక్టివ్ నవల మూసేసి ఆబగా ఆ అమ్మాయి వంక చూస్తూంటే ఓసారి పేపర్లో చదివిన ఒక విషయం గుర్తుకు వచ్చింది. ప్రాచీన భారత దేశపు వారసత్వ సంపదైన అజంతా ఎల్లోరాలనీ, కోణార్క, ఖజురహో దేవాలయాల్నీ, తాజ్‌మహల్‌నీ చూడా అని ఒంటరిగా వచ్చిన ఓ జర్మన్ యువతి తన బాధాకరమైన ఇండియా యాత్రా విశేషాలని ఓ ఇంటర్నేషనల్ పత్రికలో వర్ణిస్తూ, భారతీయులు విదేశీ యాత్రికురాళ్ళతో చాలా జుగుప్సాకరంగా వ్యవహరిస్తారనీ, అనవసరంగా తాకటానికీ, దగ్గరవ్వడానికీ ప్రయత్నిస్తారనీ, పీలుకాకపోతే కళ్ళతోనే రేప్ చేస్తారనీ, కామ వికార చేష్టలు చెయ్యడంలో ఇండియన్స్‌ని మించిన మగవాళ్ళు ఎక్కడా ఉండరని వ్రాయడం తలపు కొచ్చింది. ఆకలితో నకనకలాడుతూన్న కుక్కకి పాలుపోస్తే, పెద్ద చప్పుడుతో ఆబగా నక్ చేస్తూన్నట్లు, సడెన్‌గా నెంబర్‌వన్ సినీహీరోయిన్ తన ప్రక్కన ప్రత్యక్షమైతే దిమ్మెరపోయి మతిపోయినట్లు ఆ పిల్ల అందాన్ని కళ్ళతోటే జుర్రేస్తోంటే వాళ్ళ లెంపల్ని వాయగొట్టి మీ పనిమీరు చూసుకోండి వెధవల్లారా' అని అరవాలనిపించింది తనకి. ఆ అమ్మాయి పుస్తకంలో తల దూర్చినా, అప్పుడప్పుడు కళ్ళ కొనలమండే అందర్నీ పరికిస్తోందని అర్థమైంది.

ఎంత చక్కగా ఉంది పిల్ల! ఎంత అదృష్టం ఉండాలో అటువంటి ఆడపిల్లకి తండ్రి అవాలంటే అనిపించింది. తన వయసు ఆ పిల్ల వయసుకి రెట్టింపు. అయినా ఆ పిల్లకి తండ్రి అయ్యేంత పెద్ద వయసు మాత్రం కాదు. ఆ పిల్ల తన కూతురైతే ఎంత బావుండును! కనిపించని, ఎరగని ఆ పిల్ల తండ్రిమీద తనకా క్షణంలో అసూయ పుట్టడం తనకే నవ్వు తెప్పించింది. ఇంత చక్కని పిల్లకి చదువుతో బాటు సంగీత, సాహిత్యాలలో కూడా అభినివేశం ఉండే ఉంటుంది. ఇటువంటి పిల్ల తనకోడలుగా దొరికితే తనకి కూతురులేని లోటు తీరుస్తుంది. తన భావాలు పగ్గాల్లేని గుర్రాల్లా పరిగెడుతుంటే తనవంకే చూస్తోన్న తన నోసారి చూసి, మడుగు విప్పించి తల మరోవైపుకు త్రిప్పుకుంది. తన ప్రాణం చివుక్కుమంది. కళ్ళు త్రిప్పుకోలేని తన అందం వంక అందరిలాగే కక్కుర్తిగా చూస్తున్నాడని భావించింది కాబోలు పిచ్చిపిల్ల. అలా అనుకోవడంలో ఆ పిల్ల తప్పుకూడా లేదేమో, 'నేను అలాటివాణ్ణి కాదమ్మా!' అని చెప్పాలనిపించింది.

ఆ పిల్ల మొహం కన్పించకుండా అటు తిరగడం ఆశాభంగం కలిగించింది కాబోలు... ఆబగా



## టాక్స్

సినీ నిర్మాత నడిగాడు విలేఖరి.

"మీ సినిమాలో ఒక హీరోయిన్‌ని బుక్ చేసుకుని షూటింగ్‌పూర్తి కాకముందే వేరే హీరోయిన్‌ని మార్చేసారట ఎందుకని?"

"టర్నోవర్ టాక్స్ పెరుగుతోందని తనకు రెట్టింపు పారితోషికం కావాలని అడిగింది అందుకని!"

(బమ్మర్తి, (కొత్తగూడెం)

చూస్తూన్న ఆ కుర్రాడు దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి పుస్తకంలో తలదూర్చాడు. మరొక నిమిషానికే మళ్ళీ బుక్ మూసేసి, బోర్లా పడుకుని, గెడ్డం కింద చేతులాన్చి ఆ పిల్లవంక చూడసాగాడు. పంజాబీ డ్రెస్‌లో ఒళ్ళు ఎక్కడా కనిపించకుండా ఉన్నా, నగ్నంగా ఉన్న పాదాలమీద ఆ కుర్రాడు దృష్టి సారించాడు! లేత గులాబీ రంగులో వెన్న మీగడలంత మృదువుగా మెరుస్తున్నాయి ఆ పాదాలు. కాలి గోళ్ళకి రంగువేసుకుందేమో... గులాబీరంగు పాదాల ముందు ఆగోళ్ళ కృత్రిమమైన రంగు వెల వెల బోతోంది. కాళ్ళకున్న చిరుగజ్జెల వెండి పట్టాలు ఆ పాదాలవల్ల కొత్త అందాల్ని తెచ్చుకున్నాయి. ఆ పిల్ల నిద్రలోకి జారుకుంది కాబోలు చేతిలోని మేగజైను జారి క్రింద పడింది. కిటికీలోంచి రివ్వున వస్తున్న చలిగాలికి పైన ఫానుగాలి తోడై చలి ఎక్కువైందేమో, అర్ధ చంద్రాకారంగా ముడుచుకుని పడుకుంది. ముంగురులు గాలికి లేచి అల్లరిగా ఆడుతున్నాయి. తన రగ్గుతీసి కప్పుదామా అనిపించింది. మెలకువ వస్తే ఏమనుకుంటుందోనని సంకోచించాడు. పసిపాపాయిలా నిర్మలంగా కలలుగంటూ నిద్ర పోతూన్న ఆ పిల్ల బుగ్గలు మృదువుగా నిమిరి నుదుట మీద ముద్దు పెట్టుకోవాలనిపించిన కోర్కెను త్రొక్కిపట్టి నిద్రలోకి జారుకుంటూ చూశాడు. ఆ కుర్రాడు చలనంలేని శిలలా కళ్ళార్పకుండా అలా చూస్తూనే ఉన్నాడు!

ఎప్పటికో కీచుమంటూ బండి శబ్దం చేస్తూ ఆగడంతో మెలకువ వచ్చింది. టైం చూశాడు. నాలుగున్నర కావస్తోంది. ఆ కుర్రాడు అదే ఫోజులో గాఢనిద్రలో ఉన్నాడు! ఆ పిల్ల లేచి దిగడానికి సన్నద్ధమౌతోంది. బండి పూర్తిగా ఆగకుండానే రిజర్వుడు కంపార్టుమెంటు అనే లెక్కేమీ లేకుండా తట్టలు, బుట్టల్తో జనాలు లోపలకి తోసుకొస్తున్నారు. బరువైన పెద్ద సూట్‌కేస్‌తో ఆ పిల్ల దిగడానికి జనాలు అవకాశం ఇవ్వడంలేదు. తను బెర్తు దిగాడు. ఆ పిల్ల సూట్‌కేసుని అందుకోబోతూ 'నువ్వు దిగమ్మా, నేనందిస్తాను' అన్నాడు. ఆ పిల్ల కటువుగా 'నో, థ్యాంక్స్!' అంటూ విసురుగా జనాన్ని నెట్టుకుంటూ దిగింది. కిటికీలోంచి తను తల బయటపెట్టి క్షేమంగా దిగిందో లేదో చూస్తూన్నాడు. తనని చూసి 'ఫీ! బాస్టర్డ్!' అంటూ విస విసా సూట్‌కేస్ ఈడ్చుకుంటూ వెళ్ళిపోయింది. తన గుండెమీది పెరీకార్డియా పొరని కొత్తబ్లేడుతో కోసినట్లు సన్నని బాధ సుడులు తిరిగింది. తన ప్రవర్తనని పొరబాటుగా అర్థం చేసుకుంది. ఆ పిల్ల దూరంగా కనుమరుగవుతోంటే సన్నటి తడిపొరతో తన కళ్ళు మసకబారాయి!

"ఏమండీ, మీరు ఒక్కరూ ఏం చేస్తున్నారు దాబా మీద.... అందరూ మీ గురించి చూస్తోంటే?" అంటూ వచ్చింది శోభ.

'మీ మిత్రుడేమంటున్నాడు?"

"ఏ విషయంలోనూ మీతో ఏకీభవించనివాడు... అమ్మాయి విషయంలో మీ సెలక్షను అద్భుతంగా ఉందంటున్నాడు."

హరికి ప్రపంచం జయించినంత ఆనందంగా ఉంది. అమ్మాయికూడా తన అంగీకారాన్ని తెలిపింది. మళ్ళీ అందరూ హాలులో సమావేశం అయ్యారు. "ఇంక ఇచ్చి పుచ్చుకోవడాలు మాట్లాడుకుందామా బావగారూ" అన్నాడు హరి. అందరూ నిర్ఘాంతపోయారు. కట్నకానుకలు ఇచ్చి పుచ్చుకునే పెళ్ళిళ్ళంటే హరికి పడదని తెలుసు. పిల్ల నచ్చితే ఆ ప్రసక్తే ఉండదను కున్నారు. ఇప్పుడేమిటిది ఇలా...!

"క్షమించండి. అమ్మాయితో మాత్రమే నేనా విషయాలు మాట్లాడాలి." అన్నాడు హరి. ఏమీ అనకుండా నిశ్శబ్దంగా హాలులోంచి అంతా నిష్క్రమించారు శోభతో సహా. ఆ పిల్ల భృకుటి ముడిపడింది. హరి దగ్గరకు వస్తోంటే లేచి నిల్చోబోయింది. వారించి కూర్చోబెట్టాడు.

"అమ్మా! నేనూ ఈ దేశంలో ఓ సగటు మగపిల్లవాడి తండ్రినేనమ్మా. నాకూ కట్నం కావాలి... కాని ఆకట్నం మీ నాన్నగారు ఇవ్వగలిగేది కాదు. నువ్వుమాత్రమే ఇవ్వగల్గేది. నేనడిగిన కట్నం ఇవ్వగలవా, చెప్పుతల్లీ?"

"ఏమిటది?" ఆ పిల్ల కళ్ళతోటే అడిగింది!

"నువ్వు మా ఇంటికి కోడలిగా మాత్రమే కాక నా కూతురుగా కూడా రావాలి. నువ్వు మీ నాన్నగార్ని పిలిచినట్లే నన్ను... నన్నుకూడా 'డాడీ' అని పిలవగలవా అమ్మా? అదే నేకోరే కట్నం."

ఆ పిల్ల భృకుటి విడివడింది. దొండ పండు లాంటి పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.